సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 18 । జూలై । 2024



లక్ష్యం ఎక్కువ.. మొక్కలు తక్కువ
జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమం అంతంతమాత్రంగానే సాగుతోంది. ఇంతవరకు ఎక్కడా లక్ష్యం మేరకు నాటలేదు. 8లో



పర్ణశాలపై పట్టింపేది..?
పర్ణశాల ఆలయానికి ఏటా భారీగా ఆదాయం సమకూరుతున్నా అభివృద్ధిపై పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
28° / 25°

వాతావరణం
జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుంది.

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

డీఎస్సీ పరీక్ష కేంద్రం వద్ద బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్

కొత్తగూడెంటౌన్ : సుజాతనగర్ మండలం వేపలగడ్డ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కేంద్రం వద్ద బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉంటుందని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష జరిగే రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సెక్షన్‌ను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల లోపున ఐదుగురికి మించి ఉండరాదని, గుంపులుగా సమావేశాలు, ర్యాలీలు, మైక్‌లు, డీజేలతో ఊరేగింపులు నిషేధమని వివరించారు. ఇందుకు ఆయా పార్టీలు, సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.

ఎల్‌ఈడీ లైట్ల తయారీపై 20న వర్క్‌షాప్

కొత్తగూడెంఅర్బన్: స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కార్ప్(ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో ఎకో–క్లబ్ పాఠశాలల విద్యార్థులకు ఎల్‌ఈడీ లైట్ల తయారీపై ఈనెల 20న వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు వృత్తి నైపుణ్యం, ఆత్మవిశ్వాసం కలిగించేందుకు ఈ వర్క్‌షాపు ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఎంపిక చేసిన 50 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులు స్టీల్ ప్లేట్, గ్లాసు తీసుకుని రావాలని, ఉపాధ్యాయులు పాఠశాల రౌండ్ స్టాంప్ తేవాలని సూచించారు. ఉచిత భోజన సదుపాయం ఉంటుందని, వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజును సంప్రదించాలని తెలిపారు.

63 మంది ఎఫ్‌బీఓల బదిలీ

పాల్వంచరూరల్ : అటవీ శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. పాల్వంచ వన్యమృగాల సంరక్షణ విభాగం (వైల్డ్‌లైఫ్) డివిజన్‌లో 54 మంది బీట్ ఆఫీసరు ఉండగా, 29 మందికి నాలుగేళ్ల కాలపరిమితి పూర్తి కావడంతో బదిలీ చేశారు. టెరిటోరియల్ అటవీ డివిజన్‌లో 116 మంది ఎఫ్‌బీఓలు ఉండగా వారిలో 34 మందిని బదిలీ చేశారు. ఇక సెక్షన్ అధికారులకు గురువారం డీఎఫ్‌ఓ కార్యాలయంలో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

'మహాలక్ష్మి' కోసం ప్రత్యేక ఫోన్ నంబర్లు

ఖమ్మంమయూరిసెంటర్: మహాలక్ష్మి ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీలో ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆర్‌ఎం సరిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సుల్లో ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదు చేసేందుకే కాక బస్సుల రాకపోకల వివరాలు తెలుసుకునేందుకు బస్టాండ్లు, డిపో మేనేజర్లకు ఫోన్ నంబర్లు కేటాయించామని వెల్లడించారు. భద్రాచలం బస్టాండ్‌లో విచారణకు 99592 25987, డిపో మేనేజర్‌కు 99592 25960, కొత్తగూడెం బస్టాండ్ 99592 25982, డీఎంకు 99592 25959, మణుగూరు బస్టాండ్ 89853 61796, డీఎంకు 99592 25963 నంబర్లు కేటాయించినట్లు వివరించారు.

హైవే అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలని నిర్ణయించడంతో ఎన్‌హెచ్ అధికారులతో బుధవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఎంట్రీ, ఎగ్జిట్ల డిజైన్లను వివరించారు. అయితే, రైతులు నష్టపోకుండా తక్కువ భూమి అవసరమయ్యే డిజైన్లను ఆమోదించాలని మంత్రి తుమ్మల సూచించారు.

ఆరోగ్య సింగరేణి..



తెలంగాణలో ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా పేరున్న సింగరేణి.. కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టింది. సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల హెల్త్ ప్రొఫైళ్లను డిజిటల్ రూపంలో భద్రపరచడం, ఎస్సెమ్మెస్‌ల రూపంలో అప్రమత్తం చేయడంతో పాటు గుండె వైద్యం అందించేందుకు నడుం బిగించింది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

కార్మికులపై సంస్థ ప్రత్యేక దృష్టి
- ఎస్సెమ్మెస్ రూపంలో తరచూ అప్రమత్తం
- క్యాథ్‌ల్యాబ్ ద్వారా గుండె చికిత్సలు
- డిజిటల్ హెల్త్ ప్రొఫైళ్లకు రంగం సిద్ధం

అనారోగ్య కారణాలపై దృష్టి..
తెలంగాణ వచ్చిన గత పదేళ్లలో గణాంకాలు పరిశీలిస్తే సింగరేణిలో 2,870 మంది కార్మికులు నేమ్ రిమూవ్ జాబితాలోకి వెళ్లారు. వివిధ కారణాలతో చనిపోయిన కార్మికులను నేమ్ రిమూవ్ జాబితాలో చేరుస్తారు. ఇందులో పని ప్రదేశాల్లో చనిపోయిన కార్మికుల సంఖ్య 64 కాగా, రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారు 476 మందిగా తేలింది. ఇక అనారోగ్య సమస్యలతో మృతిచెందిన వారి సంఖ్య 2,330గా సింగరేణి యాజమాన్యం గుర్తించింది. దీంతో అనారోగ్య కారణాలతో కార్మికులు చనిపోతున్న అంశంపై దృష్టి సారించింది.

ఆరోగ్య పరీక్షలు..
సింగరేణి సంస్థ పరిధిలో మొత్తం 41,660 మంది ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. ప్రతీ ఐదేళ్లకోసారి కార్మికులకు పీడియాడికల్ మెడికల్ ఎగ్జామినేషన్ (పీఎంఈ) నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 45 ఏళ్లు నిండిన వారికైతే ప్రతీ మూడేళ్లకు పీఎంఈ చేస్తున్నారు. గతంలో ఈ పరీక్షలు నిర్వహించిన తర్వాత ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందుల వివరాలను కార్మికులకు నోటిమాటగా చెప్పి వదిలేసేవారు. కానీ ఇప్పుడు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కార్మికులు సమయానికి ఔషధాలు వాడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఆధునిక టెక్నాలజీ వాడుతున్నారు.

ఎస్సెమ్మెస్‌తో అలర్ట్..
ఉదాహరణకు బీపీ, షుగర్ వంటి వ్యాధులు ఉన్నవారు ప్రతీ రోజు ట్యాబెట్లు వాడాల్సి ఉంటుంది. ఇందుకోసం సింగరేణి ఆస్పత్రిలో నెలవారీగా మందులు తెచ్చుకోవాలి. ఎవరైనా కార్మికుడు నిర్ణీత సమయం ముగిసిన తర్వాత మందులు తీసుకోకుంటే అతడి మొబైల్ నంబర్‌కు ఎస్సెమ్మెస్ రూపంలో అలర్ట్ మెసేజ్ వెళ్తుంది. ఇలా వారం రోజులు గడిచినా మందులు తీసుకోకుంటే గని దగ్గర సదరు కార్మికుడి అటెండెన్స్ ఆటోమేటిక్‌గా నిలిచిపోతుంది. తిరిగి పునరుద్ధరించుకోవాలంటే సంబంధిత సంక్షేమాధికారిని సంప్రదించాలి. ఇలా సింగరేణి వ్యాప్తంగా 15,600 మంది కార్మికులకు ఈ తరహా మెసేజ్ వస్తోంది. మొత్తం కార్మికుల్లో వీరు 37 శాతంగా ఉన్నారు. వీరంతా బీపీ, షుగర్, థైరాయిడ్, ఉబ్బసం, గుండె, ఊపిరితిత్తులు తదితర అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు.

అందుబాటులోకి క్యాథ్‌ల్యాబ్..
సింగరేణి సంస్థలో దీర్ఘకాలిక సమస్యతో బాధపడుతున్న కార్మికుల్లో బీపీ పేషెంట్లు 9,400 మంది, షుగర్ బాధితులు 3,900 మందిగా తేలారు. ఈ వ్యాధులను ఉపేక్షిస్తే గుండె సంబంధిత సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది. దీంతో సింగరేణి పరిధిలో ఆధునిక గుండె సంబంధిత వైద్య సేవలు అందించేందుకు క్యాథ్‌ల్యాబ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. రామగుండంలోని సింగరేణి ఆస్పత్రిలో రూ.16 కోట్లతో ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఇతర ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. రామగుండంలో వచ్చిన ఫలితాలను పరిశీలించి మలివిడతలో కొత్తగూడెంలోని ప్రధాన ఆస్పత్రిలోనూ క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేయనున్నారు.

డిజిటల్ హెల్త్ ప్రొఫైల్..
కార్మికుల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌లను సిద్ధం చేసేందుకు సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. ఆస్పత్రికి వచ్చే ప్రతీ కార్మికుడికి వైద్య పరీక్షలు నిర్వహించి అతనికి సంబంధించిన సమస్త సమాచారాన్ని, రిపోర్టులను ఐడీ నంబర్‌తో భద్రపరచాలని నిర్ణయించింది. ఈ డిజిటల్ సమాచారం ఆధారంగా భవిష్యత్‌లో వైద్య సేవలు అందించడం సులువవుతుంది. ఇప్పటికే ప్రైవేట్, కార్పొరేట్ సెక్టార్‌లో ఈ విధానం అమల్లో ఉంది. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌లను పైలట్ ప్రాజెక్టుగా రామగుండం ఆస్పత్రిలో చేపట్టనున్నారు. దీంతో పాటు మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా పీఎంఈ పరీక్షల్లో కొత్తగా 2డీ ఎకో, హెచ్‌బీఏ1సీ పరీక్షలను సైతం చేర్చింది.

ఆరోగ్యంపై శ్రద్ధ



అవగాహన లేకపోవడంతో చాలా మంది కార్మికులు అనారోగ్య సమస్యలు తీవ్రమయ్యే వరకు చూస్తూ ఉండిపోతున్నారు. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని నిర్ణయించాం. ఇందుకోసం ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నాం. – జి. గురవయ్య, సేఫ్టీ జీఎం

పెద్దమ్మతల్లి ఆలయంలో తొలిఏకాదశి పూజలు



కలశ పూజ నిర్వహిస్తున్నఅర్చకుడు

పాల్వంచరూరల్ : పెద్దమ్మతల్లి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మొదట గణపతి పూజ నిర్వహించి, ఆ తర్వాత 108 కలశాలను ప్రతిష్ఠించి వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండాలని వేడుకుంటూ కలశ పూజ చేశారు. అనంతరం కేశవాపురం, జగన్నాథపురం గ్రామాలకు చెందిన మహిళలు తెచ్చిన జల బిందెలు, కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారికి అభిషేకం చేశారు. ఆ తర్వాత పంచహారతులు, నివేదన సమర్పించి మంత్రపుష్పార్చన గావించారు.



కలశాలు తీసుకొస్తున్న భక్తులు

కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక..

9లో



కొత్తగూడెం సూపర్‌బజార్‌లో పీరీల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వాడవాడలా పీరీలను ఊరేగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్ హుస్సేన్ త్యాగాలను ప్రతీ ఒక్కరు స్మరించుకున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పీరీలను ఊరేగించగా, పలు చోట్ల హిందువులు కూడా వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. పీరీల చావిడిల వద్ద నిర్వాహకులు భక్తులకు పానకం పంపిణీ చేశారు.

'అమృత్' పనుల్లో వేగం పెంచండి



రైల్వే స్టేషన్ ఆవరణలో అధికారులకు సూచనలు చేస్తున్న భరతేష్ కుమార్ జైన్

రైల్వే అధికారులకు డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్ ఆదేశం

కొత్తగూడెంఅర్బన్ : అమృత్ భారత్ పథకంలో భాగంగా భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌లో చేపట్టిన ఆధునాతన పనుల్లో వేగం పెంచాలని, గడువు నాటికి అన్నీ పూర్తి కావాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రైల్వే స్టేషన్‌లో నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంతో పాటు సింగరేణి ఏరియాల నుంచి ఎక్కువ మంది ప్రయాణికులు రైల్వే స్టేషన్‌కు వస్తుంటారని, వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పించేలా పనులు చేపడుతున్నామని చెప్పారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ రైల్వే స్టేషన్ అమృత్ భారత్ పథకం కింద ఎంపికైనందున స్టేషన్ యాక్సెస్, సర్క్యులేటింగ్ ఏరియాలు, వెయిటింగ్ హాళ్లు, టాయిలెట్లు, అవసరమైన లిఫ్ట్, ఎస్కలేటర్లు, పరిశుభ్రత, ఉచిత వైఫై వంటి సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. అనంతరం సత్తుపల్లి పార్థసారధి పురంలోని కోల్ లోడింగ్ పాయింట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీఎంఓ సురేష్‌రెడ్డి, సీనియర్ డీఎస్‌ఓ బాలాజీ, కిరణ్, సీనియర్ డీఈఎన్ దినకరన్, అధికారులు కె.వై.పాషా, రామ్‌భజన్ మీన, రామ్ బాలక్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న జైన్..
భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేశారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, అర్చకులు పాల్గొన్నారు.

పని చేసినా దక్కని 'ఉపాధి'

- ఈజీఎస్ కూలీలకు అందని వేతనాలు..
- మూడు నెలలుగా తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో రూ. 4 కోట్ల వేతనాల బకాయిలు

చుంచుపల్లి: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలు వేతనాల కోసం నాలుగు నెలలుగా ఎదురుచూడాల్సి వస్తోంది. దీంతో పనులు చేసినా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని కూలీలు ఆవేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 4 కోట్ల మేర వేతన బకాయిలు కూలీలకు రావాల్సి ఉంది. పని చేసిన వారం లోపు డబ్బులు ఇవ్వాలనే నిబంధన ఉన్నా అవి ఎక్కడా అమలుకావడం లేదు. వలసల నివారణకు ఉన్న గ్రామంలోనే పని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఇది పేదలకు వరమే అయినా పనులు చేసి 11 వారాలు గడుస్తున్నా వేతనాలు అందకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

22 మండలాల్లో పథకం అమలు..
జిల్లాలో 481 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో భాగంగా 22 గ్రామీణ మండలాల పరిధిలోని కూలీలకు 100 రోజుల పాటు 72 రకాల పనులు కల్పిస్తున్నారు. వాటిలో ప్రధానంగా పంట చేలలో నీటి గుంతలు, కందకాల తవ్వకం, పూడికతీత, పశువుల పాకలు, పంట కల్లాలు, పశుగ్రాసం పెంపకం, పండ్ల తోటలు, పొలం గట్లపై టేకు చెట్ల పెంపకం, వర్షపు నీటి మళ్లింపు కాలువలు, బంజరు భూములను సాగుకు యోగ్యంగా మార్చడం, సీసీ రహదారులు, మట్టిరోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, నర్సరీల నిర్వహణ తదితర పనులు చేస్తున్నారు. కూలీలకు కొన్ని ప్రాంతాల్లో బ్యాంకుల ద్వారా, మరికొన్ని ప్రాంతాల్లో పోస్టాఫీస్‌ల ద్వారా వేతనాలు అందజేస్తున్నారు. అయితే గత మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మండుటెండల్లో పనిచేసిన కూలీలకు 11 వారాలు గడుస్తున్నా ఇంత వరకు వేతనాలు జమ చేయలేదు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. నిరుపేద కుటుంబాలు ప్రతి సంవత్సరం ఉపాధి హామీ పనులపై ఆధారపడి జీవనోపాధిని పొందుతున్నాయి. కూలీలు డబ్బుల కోసం క్షేత్ర సహాయకుల ఇళ్లతో పాటు మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలను విడుదల చేయాలని కోరుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

11 వారాలుగా కూలి అందడం లేదు



ఇంట్లో ఖాళీగా ఉండలేక ప్రభుత్వం కల్పించిన ఉపాధి హామీ పనులకు వెళ్లాం. మండుటెండల్లో రోజుకు నాలుగైదు గంటలకు పైగా పనులు చేశాం. చెమటోడ్చి పని చేసినా డబ్బులు సమయానికి చెల్లించడం లేదు. అధికారులు చొరవ తీసుకొని కూలి విడుదల చేసి ఆదుకోవాలి.

– నూనావత్ సరిత, ఉపాధి కూలీ

త్వరలోనే విడుదల అవుతాయి



ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బకాయిలు ఉన్నది వాస్తవమే. విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంది. కూలీలు నిరాశకు లోను కావొద్దు. పని చేసిన ప్రతి కూలీకి డబ్బులు జమవుతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలో బకాయిలు విడుదలయ్యే అవకాశం ఉంది.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

కిన్నెరసాని మూడు గేట్లు ఎత్తివేత



నీరు విడుదల చేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలయాశానికి వరద పోటెత్తుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి బుధవారం ఎగువ నుంచి 2,800 క్యూసెక్కుల వరద నీరు రావడంతో నీటిమట్టం 402.90 అడుగులకు పెరిగింది. దీంతో మూడు గేట్లు ఎత్తి 12వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు. వరద నీటి విడుదలతో దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.


తాలిపేరు నుంచి సాగునీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం సాగునీరు విడుదల చేశారు. అంతకుముందు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత రైతులకు తాలిపేరు కల్పతరువు వంటిదని, సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో మరమ్మతు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఈ రాంప్రసాద్, డీఈలు తిరుపతి, శ్రీనివాస్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అలుగుపోసిన 'గుబ్బలమంగి'



పొంగి ప్రవహిస్తున్న గుబ్బలమంగి ప్రాజెక్టు

నీట మునిగిన నారచీరల ప్రాంతం

దుమ్ముగూడెం : మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో కె.లక్ష్మీపురం గ్రామంలోని గుబ్బలమంగి ప్రాజెక్ట్ బుధవారం అలుగుపోసింది. అలాగే, పర్ణశాల వద్ద నార చీరల ప్రాంతానికి భారీగా వరద నీరు చేరడంతో సీతమ్మ వారి విగ్రహం మునిగిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తుతుండడంతో గోదావరికి కూడా భారీగా నీరు చేరుతోంది.

క్లుప్తంగా

అలుగులో చేపల వేట



చేపలు పడుతున్న స్థానికులు

చర్ల రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దేవానగరం వద్ద ప్రధాన రహదారిపై ఉన్న చెరువు అలుగు పోస్తుండగా, పరిసర ప్రాంతాల ప్రజలు జోరుగా చేపలు పట్టారు. వలలు, గాలాలు, చీరలతో చేపల వేట సాగిస్తూ సందడి చేశారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



బాధితురాలికి పర్సు ఇస్తున్న కానిస్టేబుల్

కొత్తగూడెంటౌన్: పోగుట్టుకున్న పర్స్‌తోపాటు నగదును తిరిగి బాధితురాలికి అందజేసిన సంఘటన సోమవారం జరిగింది. ఓ మహిళ ఖమ్మం వెళ్లేందుకు బుధవారం కొత్తగూడెం బస్టాండ్‌కు చేరుకుంది. ఈ క్రమంలో బస్టాండ్‌లో పర్సును పోగొట్టుకుంది. పర్సులో రూ.10 వేల నగదు, రూ.38 వేల విలువైన సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు ఉన్నాయి. మహిళ రోదిస్తూ బస్టాండ్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ అందరినీ అడుగుతోంది. అప్పటికే బస్టాండ్‌లో విధులు నిర్వర్తిస్తున్న కొత్తగూడెం వన్‌టౌన్ కానిస్టేబుల్ రాంబాబుకు పర్సు దొరికింది. దీంతో బాధితురాలి వివరాలు ఆరా తీసి పర్సును అప్పగించాడు. ఈ సందర్భంగా కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు.

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి



వృద్ధురాలి మృతదేహం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన సత్రం వద్ద బుధవారం ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. ఆమె వయసు 65 సంవత్సరాలు పైబడి ఉంటుందని ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే 8712682160 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దమ్మపేట: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... బుధవారం మండలంలోని రెడ్యాలపాడు గ్రామం నుంచి దమ్మపేటకు ట్రాక్టరులో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. ఈ క్రమంలో గుర్వాయిగూడెం గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సాయికిషోర్ రెడ్డి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఓ వ్యక్తిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాణా ప్రతాప్ కథనం ప్రకారం.. ఈ నెల 10న తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన పగడిపల్లి నాగేశ్వరరావు, పద్మ దంపతులు బైక్‌పై జూలూరుపాడు మండలం సురారంలో జరిగే కర్మ కార్యక్రమానికి బయలుదేరారు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగి దినేష్ కుమార్ రాజు, అతని భార్య కలిసి కారులో ఖమ్మం వెళుతున్నారు. ఈ క్రమంలో జూలూరుపాడు శ్రీ షిర్డి సాయిబాబా ఆలయం వద్దకు రాగానే దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు దంపతులు గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దినేష్ కుమార్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెట్రోల్ కల్తీపై వివాదం

ఇల్లెందురూరల్: మండలంలోని 21 పిట్ ఏరియా సమీపంలోని పెట్రోల్‌బంక్‌లో బుధవారం పెట్రోల్ కల్తీపై వివాదం చోటుచేసుకుంది. ఇల్లెందు పట్టణంలోని స్టేషన్‌బస్తీకి చెందిన యువకులు బైక్‌లో పెట్రోల్ పోయించుకుని కొమరారం వైపుగా బయలుదేరారు. బంక్ నుంచి వంద మీటర్ల దూరంలోనే బైక్ ఆగిపోవడంతో అనుమానించిన యువకులు పెట్రోల్‌ను పరీక్షించారు. పెట్రోల్‌లో నీరు తేలి కనిపించడంతో తిరిగి బంక్ వద్దకు చేరుకుని నిర్వాహకులతో ఘర్షణ పడ్డారు. దీంతో స్పందించిన నిర్వాహకులు బైక్ ట్యాంక్‌ను శుభ్రం చేయించడంతో వివాదం సద్దుమణిగింది.

కలప సీజ్

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో రెండు టేకు మంచాలను, కలప దిమ్మెలను అటవీ శాఖ టాస్క్‌ఫోర్స్ రేంజర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఇటీవల పట్టుకున్నారు. రెండు టేకు మంచాలను భద్రాచలం టింబర్ డిపోకు తరలించి విచారణ చేపడుతున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

లక్ష్యం ఎక్కువ.. మొక్కలు తక్కువ



ఇల్లెందు మున్సిపల్ నర్సరీలో పెంచుతున్న పూల మొక్కలు

- మున్సిపాలిటీల్లో ప్రారంభంకాని వనమహోత్సవం
- జిల్లావ్యాప్తంగా 65.14 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హరితహారం పేరు 'వన మహోత్సవం'గా మార్చారు. ఈ నెలలో పండుగలా ప్రారంభం కావాల్సిన మొక్కలు నాటే కార్యక్రమం ఊసే లేకుండా పోయింది. పది రోజుల నుంచి ఏదో ఓ ప్రాంతంలో రోజూ వర్షం కురుస్తూనే ఉంది. ఈ తరుణంలో జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటాలని అటవీశాఖ ద్వారా.. ప్రతీ శాఖ, మండలం, మున్సిపాలిటీకి లక్ష్యాలు నిర్దేశించారు. ఆయా ప్రాంతాల్లోని నర్సరీల్లో లక్ష్యానికి తగిన మొక్కలు సిద్ధంగా లేవు. దీనికి తోడు వనమహోత్సవం నిర్వహణకు ప్రణాళికలు రూపొందించలేదు. ఏ మండలం, మున్సిపాలిటీలోనూ మొక్కలు నాటే కార్యక్రమం పట్ల సభలు, సమావేశాలు నిర్వహించలేదు. గత ప్రభుత్వం అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేసేది. ఒకటి రెండు రోజులు మొక్కలు నాటి చేతులు దులుపుకుంటే లక్ష్యం నెరవేరదని, వన మహోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

డ్వాక్రా గ్రూపుల ద్వారా మొక్కలు పెంపకం

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లోనూ మొక్కల పెంపకం బాధ్యతను డ్వాక్రా గ్రూపులకు అప్పగించారు. ఏ మున్సిపాలిటీలోనూ నాటే మొక్కల లక్ష్యానికి సరిపడా మొక్కలను ఆయా నర్సరీల్లో డ్వాక్రా గ్రూపులు పెంచలేదు. నాలుగు మున్సిపాలిటీల్లో 5 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించగా, మూడు లక్షల మొక్కలు కూడా అందుబాటులో లేవు. కాగా ఇప్పటివరకు నీడను, ఫలాలను ఇచ్చే మొక్కలను నాటారు. ఈ సంవత్సరం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవంలో పూల మొక్కల పెంపకంపై దృష్టి సారించింది. మున్సిపల్ నర్సరీల్లో అధికంగా పూల మొక్కలనే పెంచుతున్నారు. కాగా జిల్లాలో ఈ ఏడాది 65.14 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యం నిర్దేశించారు.

నాటేందుకు సిద్ధం..



మున్సిపల్ నర్సరీలోని మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. వన మహోత్సవ కార్యక్రమాన్ని వచ్చే శుక్రవారం నుంచి ప్రారంభిస్తాం. షెడ్యూల్ నిర్ణయించి మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తాం. మున్సిపాలిటీకి 60 వేల మొక్కలు లక్ష్యం కాగా, 40 వేలు మొక్కలు పంపిణీ చేసి, 20 వేల మొక్కలు నాటుతాం. ముఖ్యంగా చామంతి, మందారం, మల్లె, లిల్లి, డాలింగ్, రోజ్ , గులాబీ, తులిప్, కనకాంబరం వంటి పూల మొక్కలను నర్సరీలో పెంచుతున్నాం.

– బి. యాదగిరి, కమిషనర్, ఇల్లెందు

77 కిలోల గంజాయి సీజ్



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

బూర్గంపాడు: మండల పరిధిలోని పినపాక పట్టీనగర్ సమీపంలో బుధవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 77 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల నుంచి కారులో గంజాయిని తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో అధికారులు పట్టీనగర్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. కారులో ఉన్న 77.20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కారును సీజ్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.19.25 లక్షలు ఉంటుందని అంచనా. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నరదేవ్‌సింగ్, అతుల్‌పాల్‌ను అదుపులోకి తీసుకుని, కొత్తగా వచ్చిన ఎన్‌డీపీఎస్ చట్టాల ప్రకారం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్, హెడ్‌కానిస్టేబుల్ ఖరీమ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

జూపెడలో విషాదం..

- అత్త గారింటికి వెళ్లి క్వారీలో మునిగి మృతి చెందిన గ్రామవాసి
- బిల్డర్‌గా పలువురికి సుపరిచితుడైన శ్రీపాల్‌రెడ్డి
- స్నేహితుడి కుటుంబంలోనూ ఇంకో ఇద్దరి మృత్యువాత



శ్రీపాల్‌రెడ్డి (ఫైల్)

తిరుమలాయపాలెం: పండుగ పూట ఆనందంగా గడపాల్సిన ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. తిరుమలాయపాలెం మండలం జూపెడకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, బిల్డర్ తిప్పారెడ్డి శ్రీపాల్‌రెడ్డి (47) స్నేహితుడి కుటుంబంతో కలిసి అత్త గారింటికి వెళ్లి ప్రమాదవశాత్తు మృత్యువాత పడడంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.. జూపెడకు చెందిన శ్రీపాల్‌రెడ్డి ఖమ్మం, తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూనే బిల్డర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆయన భార్య శైలజ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. ఈ మేరకు శైలజ స్నేహితురాలైన ఏపీకి చెందిన నాగమణి – చామలిరాజు (45) కుటుంబంతో కలిసి మంగళవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్‌లోని దండుమైసమ్మ ఆలయం వద్ద శ్రీపాల్‌రెడ్డి బంధువులకు సంబంధించి శుభకార్యానికి హాజరయ్యారు. బుధవారం మొహర్రం సెలవు కావడంతో శ్రీపాల్‌రెడ్డి అత్తగారి ఊరైన బొప్పారం వెళ్లారు. అక్కడ సరదాగా గడిపాక శ్రీపాల్‌రెడ్డి, ఆయన పెద్ద కుమారుడు చేతన్‌రెడ్డి, చామలి రాజు, ఆయన ఇద్దరు కుమార్తెలు ఉషాంక, రితికతో పాటు శ్రీపాల్‌రెడ్డి బంధువుల అమ్మాయి వర్షిత కలిసి ఈత నేర్చుకోవడానికి బొప్పారం సమీపానే బిక్కేరు వాగుకు వెళ్లారు. అక్కడ నీరు లేకపోవడంతో చెరువు సమీపంలో క్వారీ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఈత తెలిసిన చేతన్‌రెడ్డి లోపలకు దిగగా.. ఉషాంక జారి పడుతుండటంతో ఆమెను కాపాడేందుకు రాజు, ఆపై శ్రీపాల్‌రెడ్డి, రాజు చిన్నకుమార్తె రితిక నీట మునిగారు. ఈ క్రమంలో రితికను మాత్రం చేతన్‌రెడ్డి కాపాడగా మిగిలిన ముగ్గురూ మృత్యువాత పడ్డారు. కాగా, పోస్టుమార్టం అనంతరం శ్రీపాల్‌రెడ్డి మృతదేహాన్ని స్వగ్రామమైన జూపెడకు తీసుకురాగా కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అలాగే, వివిధ పార్టీ నాయకులు రామసహాయం నరేశ్‌రెడ్డి తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా, ప్రమాదంపై శ్రీపాల్‌రెడ్డి మామ నల్లుల ఉపేందర్‌రెడ్డి స్పందిస్తూ బొప్పారంలో కొన్నేళ్ల కిందట క్వారీ మూతపడినా గుంతలను పూడ్చకపోవడంతో నీళ్లు చేరి ప్రమాదానికి కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటికి చుట్టపుచూపుగా వచ్చిన ముగ్గురు మృత్యువాత పడడం తమను కలచివేస్తోందని కన్నీరుమున్నీరుగా రోదించారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

కారేపల్లి: షుగర్‌తో బాధపడుతున్న వ్యక్తికి కాలి గాయం కావడంతో చికిత్స కోసం కారేపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రాగా.. వైద్యం వికటించి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని మాణిక్యారం గ్రామానికి చెందిన రేపాకుల లాలయ్య (55), భార్య వీరమ్మతో కలిసి ఖమ్మంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. షుగర్‌తో బాధపడుతున్న లాలయ్య కాలి గాయాల చికిత్స కోసం కారేపల్లిలోని డాక్టర్ సామినేని రాఘవులు వద్దకు భార్యతో కలిసి వచ్చారు. ఈ క్రమంలో లాలయ్యను పరీక్షించిన వైద్యుడు రెండు ఇంజక్షన్లు ఇచ్చాడు. అనంతరం తల తిరుగుతూ నరాలు లాగుతున్నాయని చెబుతూనే లాలయ్య స్పృహ కోల్పోయే స్థితికి చేరాడు. దీంతో డాక్టర్ రాఘవులు మరో మూడు ఇంజక్షన్లు ఇవ్వగా నిమిషాల వ్యవధిలోనే లాలయ్య స్పృహ కోల్పోయి మృతి చెందాడని తెలిసింది. అయితే, వైద్యం వికటించడమే ఇందుకు కారణమని కుటుంబీకులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొనగా కారేపల్లి ఎస్‌ఐ ఎన్.రాజారాం చేరుకొని వైద్యుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

న్యాయం చేయాలని డిమాండ్

వైద్యుడి నిర్లక్ష్యంతోనే లాలయ్య మృతి చెందినందున నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగగా, పెద్దమనుషులు కలగజేసుకుని ఇరువర్గాలతో చర్చించారు. ఈ నేపథ్యాన బాధిత కుటుంబానికి వైద్యుడు పరిహారం చెల్లించేందుకు అంగీకరించినట్లు తెలిసింది. దీంతో మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తరలించారు. కాగా, బాధిత కుటుంబాన్ని సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రంనాయక్, కొండబోయిన నాగేశ్వరరావు తదితరులు పరామర్శించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని వసూళ్లు?

- దంపతులను విచారించిన పోలీసులు

ఖమ్మంఅర్బన్: కలెక్టరేట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బు వసూళ్లకు పాల్పడిన దంపతులపై ఫిర్యాదులు అందడంతో ఖమ్మం అర్బన్ పోలీసులు బుధవారం విచారించారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తికి చెందిన దంపతులు ఈ మోసానికి పాల్పడ్డారని తెలిసింది. దంపతుల్లో భార్య కలెక్టరేట్‌లోని ఓ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తుండగా తనకు రూ.20 వేలకు పైగా వేతనం వస్తోందని చెప్పుకుంది. ఇంకొందరి అవసరం ఉందని నమ్మించిన ఆ దంపతులు రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి, గణేశ్వరం, రఘునాథపాలెం పరిసర గ్రామాలతో పాటు, ఖమ్మం ఖానాపురానికి చెందిన పలువురి వద్ద రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఆతర్వాత ఉద్యోగాలు రాకపోవడంతో ఖానాపురానికి చెందిన కొందరు ఖమ్మం అర్బన్ పోలీసులను ఆశ్రయించగా దంపతులను బుధవారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా మోసపోయినట్లు పలువురు తమను సంప్రదించడంతో ప్రాథమికంగా విచారించామని తెలిపారు. అయితే, రాతపూర్వకంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని వెల్లడించారు.

సీపీఆర్ చేసి.. ప్రాణాలు కాపాడి..



సీపీఆర్ చేస్తున్న ఆర్‌ఎంపీ సుభాని

ములకలపల్లి : గుండె పోటుకు గురైన వృద్ధుడిని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. మండల పరిధిలోని గండిపోలు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు మంగళవారం రాత్రి గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అపస్మారకస్థితికి చేరుకున్న వృద్ధుడిని జగన్నాథపురంలోని ఆర్‌ఎంపీ సుభాని వద్దకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆర్‌ఎంపీ సీపీఆర్ చేయగా, వృద్ధుడికి మెలకువ రావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం పాల్వంచ తరలించారు. ఈ వీడియో వాట్సప్ గ్రూపుల్లో వైరల్‌గా మారగా, సమయస్ఫూర్తితో వ్యవహరించిన ఆర్‌ఎంపీ సుభానిని పలువురు అభినందిస్తున్నారు.

ఇద్దరు పర్యాటకులపై దాడి

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసానిలో ఇద్దరు పర్యాటకులపై బుధవారం సాయంత్రం దాడి జరిగింది. తొలుత కొత్తగూడేనికి చెందిన, బైక్‌పై వచ్చిన వ్యక్తి టికెట్ తీసుకోకుండా లోపలకు వెళ్లాడు. తమవాళ్లు వెనుక వస్తున్నారని, వారు టికెట్ తీసుకుంటారని చెప్పి వెళ్లాడు. అనంతరం కొత్తగూడేనికే చెందిన మరో ఇద్దరు మరో బైక్‌పై వచ్చారు. వారు టికెట్ తీసుకుని వెళ్తుండగా, ముందు వెళ్లిన వ్యక్తి టికెట్ వ్యవహారంపై కౌంటర్ వద్ద ఉన్న ఎఫ్‌బీఓకు, ఇద్దరు పర్యాటకులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఎఫ్‌బీఓ వారిపై దాడి చేశాడు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. పునుకుల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వారి మధ్య రాజీకుదిర్చినట్లు సమాచారం. దీంతో బాధితులు కేసు పెట్టకుండా వెనుదిరిగారు.

అమ్మమ్మను హత్యచేసిన మనవడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: గంజాయికి అలవాటు పడిన వ్యక్తి పింఛన్ డబ్బు ఇవ్వలేదని అమ్మమ్మను హత్య చేయగా.. నిందితుడిని ఖమ్మం టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ బాలకృష్ణ వెల్లడించారు. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన అమరబోయిన రాంబాయమ్మపై ఆమె మనవడు ఉదయ్‌కుమార్ దాడి చేసి సోమవారం అర్ధరాత్రి హత్య చేసిన విషయం విదితమే. నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ సూరజ్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల మృతికి అధికారులే బాధ్యత వహించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–2లో కార్మికుల మృతికి రక్షణాధికారులే బాధ్యత వహించాలని జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు బుధవారం రాత్రి ఒక ప్రకటనలో కోరారు. బుధవారం సెకండ్ షిఫ్ట్‌లో ఇద్దరు కార్మికులు (ఫిట్టర్, జనరల్ మజ్దూర్) మృతి చెందారని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే మూడు ప్రమాదాలు జరిగి ముగ్గురు కార్మికులు మృత్యువాత పడ్డారని, ఇప్పుడు ఈ ప్రమాదం తోడైందని తెలిపారు. మృతుల కుటుంబాలకు బ్యాంక్ ఇన్సూరెన్స్ చెల్లించి చేతులు దులుపుకోవటం సరికాదని పేర్కొన్నారు. రూ. 5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఎల్లో, రెడ్ కార్డ్ లంటూ కార్మికులపై ఆంక్షలు విధించడం సరికాదని పేర్కొన్నారు.

తక్కువ ధరకే బైక్ వస్తుందని..

- రూ. 38 వేలు పోగొట్టుకున్న యువకుడు

గుండాల: ఫేస్‌బుక్‌లో పరిచయమైన అపరిచిత వ్యక్తి ద్వారా అతి తక్కువ ధరకు ద్విచక్రవాహనం వస్తుందని నమ్మి సైబర్‌నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ యువకుడు మోసపోయాడు. ఈ సంఘటన ఆళ్లపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తక్కువ ధరకే ద్విచక్రవాహనం విక్రయిస్తామంటూ మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన యువకుడు గొగ్గెల పృథ్వీరాజ్‌కు సైబర్ నేరగాడు ఫోన్‌చేశాడు. దీంతో నమ్మిన యువకుడు విడతల వారీగా రూ. 38,600 ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. కాగా డబ్బులు చెల్లించి వారం రోజులైనా ద్విచక్రవాహనం రాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించాడు. దీంతో వారం రోజుల క్రితం ఆళ్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రతీష్ సైబర్ క్రైం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అడవి బిడ్డలకు దద్దుర్లు..

- అనారోగ్యంతో విలవిల్లాడుతున్న చిన్నారులు
- ఐటీడీఏ పీఓ ఆదేశాలతో గ్రామంలో వైద్య శిబిరం
- కాలినడకన చిరుతానిపాడు వెళ్లిన వైద్యులు, సిబ్బంది



చిరుతానిపాడులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు





దద్దుర్లు వచ్చిన చిన్నారులు

పాల్వంచరూరల్: అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ జ్వరాలతో ఆందోళన చెందుతున్న అడవి బిడ్డలను దద్దుర్ల సమస్య వేధిస్తోంది. దీంతో చిన్నారులు విలవిల్లాడుతున్నారు. మండల పరిధిలోని బంజర గ్రామపంచాయతీ చిరుతానిపాడులో ఈ సమస్య తలెత్తింది. గ్రామంలోని మడకం రాజుకు చెందిన ఇద్దరు కుమారులు మహేష్, రాజులకు శరీరంపై పొక్కులు వచ్చాయి. చిన్నారులు దద్దుర్లు వచ్చి అవస్థ పడుతున్నారు. మారుమూల గ్రామం కావడంతో సకాలంలో వైద్య చేయించలేక గిరిజనులు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. దద్దుర్లు మానకపోగా పుండ్లు పడి మరింత అవస్థకు గురవుతున్నారు. సమీపంలో ఉల్వనూరు పీహెచ్‌సీ ఉన్నా వైద్యసిబ్బంది గ్రామానికి వెళ్లడంలేదు. బాధిత చిన్నారులను కూడా వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లకపోవడంతో దద్దుర్ల వ్యాధి తీవ్రమైంది. ఐటీడీఏ పీఓ ఆదేశించే వరకు పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది గ్రామానికి వెళ్లకపోవడం గమనార్హం.

గ్రామంలో వైద్య శిబిరం

చిరుతానిపాడు గ్రామంలో ఉల్వనూరు పీహెచ్‌సీ వైద్యులు తేజశ్రీ, జగన్నాథపురం డాక్టర్ రాజు, డాక్టర్ వినయ్ బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. దద్దుర్లు సోకిన చిన్నారులను పరీక్షించి మందులను అందజేశారు. గ్రామంలో 32 మందిని పరీక్షించగా 8 మందికి జ్వరలక్షణాలు ఉండగా, రక్త పూతలు తీశారు. చిన్నారులకు జీడి పెట్టడం వల్ల ఎలర్జీతో దద్దుర్లు వచ్చాయని వైద్యులు నిర్ధారించారు. శిబిరంలో వైద్య సిబ్బంది సీహెచ్‌ఓ కనక దుర్గ, హెల్త్ అసిస్టెంట్ రామిరెడ్డి, శంకర్, సురేష్, ఎంటీఎస్ వాసం చైతన్య పాల్గొన్నారు.

గొత్తి కోయ గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు..

ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గొత్తి కోయ గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తామని, గిరిజనులందరూ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ తెలిపారు. పాల్వంచ మండలంలోని చిరుతానిపాడు గ్రామంలో గిరిజనులు దద్దుర్ల సమస్యతో బాధపడుతున్నారని ఐటీడీఏ పీఓకు సమాచారం అందిందని, ఆయన ఆదేశాలతో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, బాధితులకు చికిత్స అందించామని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది కాలినడకన వెళ్లి పరీక్షలు నిర్వహించి, వైద్యసేవలందించారని తెలిపారు. వర్షాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో కొందరికి వైరల్ జ్వరాలు సోకాయని, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు తేలిందన్నారు. అనారోగ్యానికి గురైన చిన్నారులు సమీపంలోని ఆస్పత్రికి రాకుండా నాటు వైద్యంపై ఆధార పడుతున్నారని, దీంతో జబ్బులు తగ్గకుండా పోతున్నాయని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

కనీస వసతులు కల్పించేదాకా విశ్రమించను..



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

- రూ. 147 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం
- ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజల కనీస అవసరాలు తీర్చేవరకు విశ్రమించేది లేదని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ కార్యకర్తలతో పాత కొత్తగూడెంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్రజెండా ఎప్పుడూ పేదల పక్షాన నిలబడి, వారి హక్కుల సాధనకు పోరాడుతూనే ఉంటుందని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ఎప్పుడూ పేదల సంక్షేమం కోసమే పాటుపడతారని అన్నారు. తాను కొత్తగూడెం నియోజకవర్గానికే ఎమ్మెల్యేను అయినప్పటికీ.. రాష్ట్రంలోని పేదలంతా తనను కలిసేందుకు వస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత తనపై ఉందని అన్నారు. ఇతర పార్టీల్లో డబ్బు, పదవులు, వారసులు ఉంటారని, ఎర్రజెండా పార్టీలో మాత్రం ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా పేదల దరి చేరుస్తామని చెప్పారు. ఎలాంటి డబ్బు ప్రమేయం ఉండదని, ఎవరైనా అలాంటి ప్రయత్నాలు చేస్తే వారిని పార్టీకి దూరం పెడతామని స్పష్టం చేశారు. అన్ని పనులూ చేస్తామని చెప్పబోమని, పేదల కనీస అవసరాలను మాత్రం తీరుస్తామని ప్రకటించారు. రూ.147 కోట్లతో విద్యానగర్ కాలనీ నుంచి పాల్వంచ వరకు బైపాస్‌రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. పాతకొత్తగూడెం ఎస్సీ కాలనీ ప్రజలకు నూతన గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజల కనీస సౌకర్యాల కల్పనలో సీపీఐ కీలకపాత్ర పోషించిందన్నారు. అనంతరం 100 కుటుంబాల వారు సీపీఐలో చేరారు. సమావేశంలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, విజయ్‌కుమార్, చారి, ధర్మరాజు, మునిగడప వెంకటేశ్వర్లు, యూసుఫ్, వాసిరెడ్డి మురళి, లగడపాటి రమేష్, రత్నకుమారి, మేదిని లక్ష్మి, కిలారు ప్రసాద్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో పోలీసుల విచారణ

మృతురాలి పెద్దకొడుకుపై అనుమానాలు?

కారేపల్లి: మండలంలోని సామ్యతండా గ్రామంలో ఈ నెల 15వ తేదీ రాత్రి గుగులోతు సక్రి (65) హత్య జరగగా.. పోలీసులు విచారణలో వేగం పెంచారు. ఆమె మెడ, ముఖంపై తీవ్రగాయాలతో మృతి చెంది ఉండగా మంగళవారం గుర్తించారు. ఈ నేపథ్యాన మంగళవారం రాత్రి సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి పరిశీలించి డాగ్‌స్కాడ్‌తో అర్ధరాత్రి వరకు విచారణ చేపట్టారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉండగా.. ఆమె పెద్దకుమారుడి కదలికల ఆధారంగా అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అంతేకాక సక్రి పెద్ద కుమార్తె బుజ్జి సైతం ఆస్తి తగాదాల కారణంగానే తన తల్లిని హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ కోణంలో విచారణ చేస్తున్నారు. కాగా, సక్రి హత్య అనంతరం ఆమె భర్తకు వచ్చిన పింఛన్ రూ.50 వేలు, బంగారపు చెవిదిద్దులు, కాళ్ల పట్టీలు కానరాకపోవడంతో పోలీసులు ఆ దిశగా కూడా విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు బుధవారం ఖమ్మం ఆస్పత్రిలో సక్రి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా సామ్యతండాకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.


అదనపు డాక్యుమెంట్లు సమర్పించండి: హైకోర్టు

కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు భూ కేటాయింపు రద్దు కోరుతూ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు ప్రభుత్వం చేసిన భూమి కేటాయింపును రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌లో అదనపు డాక్యుమెంట్లు సమర్పించాలని హైకోర్టు పిటిషనర్లను ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కోసం బీఆర్‌ఎస్‌కు 2023లో ప్రభుత్వం 11 ఎకరాలను కేటాయించింది. దీని కోసం బీఆర్‌ఎస్ ఎకరాకు రూ.3.41 కోట్లు చెల్లించింది. అయితే కోకాపేట్‌లో బీఆర్‌ఎస్‌కు కేటాయించిన భూమి తమదేనంటూ సికింద్రాబాద్‌కు చెందిన అశోక్ దత్ జైశ్రీతోపాటు అతని కుటుంబసభ్యులు పిటిషన్ దాఖలు చేశారు. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్‌ఏ, హెచ్‌ఎండీఏ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, గండి పేట్ తహసీల్దార్‌తోపాటు బీఆర్‌ఎస్ పార్టీని ప్రతి వాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున వి.మురళీమనోహర్ వాదనలు వినిపిస్తూ.. కోకా పేట్‌లోని ఆ భూమిని పిటిషనర్లు వారసత్వంగా పొందారన్నారు. వారి పూర్వీకులు కూడా ఆ భూమిని చట్టప్రకారం హక్కుదారుల వద్ద కొనుగోలు చేశారని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు భూ కేటాయింపు చట్టవిరుద్ధమని.. ఆ గెజిట్‌ను రద్దు చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. భూ హక్కులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అదనపు డాక్యుమెంట్లు సమర్పించాలని ఆదేశించారు.

శ్రీశైలం దిశగా కృష్ణమ్మ పరుగులు

- నారాయణపూర్ డ్యామ్ 9 గేట్లు ఎత్తి దిగువకు 37,260 క్యూసెక్కుల నీటి విడుదల
- నాలుగైదు రోజుల్లో శ్రీశైలానికి వరదనీరు చేరే అవకాశం
- ఆల్మట్టిలోకి నిలకడగా వరద ప్రవాహం
- తుంగభద్రలో పెరిగిన వరద



భద్రాచలం వద్ద జలకళ సంతరించుకున్న గోదావరి



తాలిపేరు ప్రాజెక్టు నుంచి భారీగా విడుదలవుతున్న వరదనీరు

సాక్షి, హైదరాబాద్: కృష్ణానది వరద ఉధృతికి కర్ణాటకలోని నారాయణపూర్ డ్యామ్‌లో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో ఆ రాష్ట్ర అధికారులు బుధవారం డ్యామ్ గేట్లు 9 ఎత్తి దిగువకు 37,260 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో కృష్ణమ్మ శ్రీశైలం వైపు పరుగులు తీస్తూ వస్తోంది. జూరాల ప్రాజెక్టులో నీటినిల్వ ఇప్పటికే 7.66 టీఎంసీలు ఉన్న నేపథ్యంలో..ఒక్క రోజులోనే ఆ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుంది. ఆ తర్వాత జూరాల గేట్లు ఎత్తి దిగువకు నీటికి విడుదల చేస్తారు. ఈ నేపథ్యంలో నాలుగైదు రోజుల్లో శ్రీశైలానికి ఎగువ నుంచి వరద చేరే అవకాశం ఉందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల కృష్ణా ప్రధానపాయ, ఉపనదుల్లో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి డ్యామ్‌లోకి 92,836 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా.. నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరింది. దీంతో ఆ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 65 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఆ జలాలు నారాయణపూర్ డ్యామ్‌లోకి చేరుతున్నాయి. కృష్ణా ప్రధానపాయలో వరద మరో నాలుగైదు రోజులు ఇదే రీతిలో కొనసాగే అవకాశముందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 49,522 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 39.72 మీటర్లకు చేరుకుంది.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఏపీ 4.5 టీఎంసీలు.. తెలంగాణకు 5.414 టీఎంసీల నీటిని కేటాయిస్తూ మంగళవారం కృష్ణా బోర్డు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సాగర్‌లో నీటిమట్టం కనీస స్థాయికి దిగువన ఉన్న నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 5.705 టీఎంసీలను విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ కుడి కేంద్రం ద్వారా ఏపీ 15,800, ఎడమ కేంద్రం ద్వారా తెలంగాణ 6,357 వెరసి 22,157 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తుండటంతో నీటినిల్వ 33.24 టీఎంసీలకు తగ్గింది. సాగర్‌లోకి 21,481 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 122.69 టీఎంసీలకు చేరుకుంది. తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు బుధవారం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బుధవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటి నిల్వ ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1705	129.72	1699.67	102.53	92,736	65,000
నారాయణపూర్	1615	37.64	1611.75	33.21	51,250	37,260
ఉజ్జయిని	1630	117.64	1603.25	48.85	20,980	200
జూరాల	1045	9.66	1041.7	7.66	2,500	2,720
తుంగభద్ర	1633	105.79	1611.07	39.72	49,522	393
శ్రీశైలం	885	215.81	808.20	33.24	-	22,189
నాగార్జునసాగర్	590	312.05	504	122.69	21,481	6,398
పులిచింతల	175	45.77	99.41	0.72	154	50
ప్రకాశం బ్యారేజీ	57.05	57.05	3.07	3.07	8,193	8,193

వరద గోదావరి

భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 21 అడుగులకు చేరే అవకాశం

భద్రాచలం అర్బన్: గోదావరి నిండుకుండను తలపిస్తోంది. భద్రాచలం వద్ద ఈ నెల 13వ తేదీ నుంచి 13 అడుగుల మేర నీటిమట్టం నిలకడగా ఉంది. రెండు,మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద వచ్చి చేరుతుండడంతో మంగళవారం రాత్రి 14.5 అడుగులకు చేరింది. ఆపై అంతకంతకూ పెరుగుతూ బుధవారం సాయంత్రం 5 గంటలకల్లా 18.1 అడుగులకు చేరుకుంది. కాగా, బుధవారం రాత్రి మరో మూడు అడుగుల మేర పెరిగి 21 అడుగులకు చేరే అవకాశముందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు నదిలోకి దిగొద్దని హెచ్చరిస్తున్నారు.

'తాలిపేరు'కు పోటెత్తుతున్న వరద

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తుతోంది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిలాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో బుధవారం ఉదయం ప్రాజెక్టు 25 గేట్లలో 12 గేట్లు అడుగు మేర ఎత్తి 16,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అయినా వరద ఉధృతి ఆగలేదు. దీంతో మధ్యాహ్నం 3 గంటలకు 22 గేట్లు అడుగు మేర ఎత్తి ద్వారా 63 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి వరద మరింతగా పెరగగా, 20 గేట్లను రెండేసి అడుగుల మేర, మిగతా ఐదు గేట్లను పూర్తిగా ఎత్తి 70,750 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు.



బిడ్డా.. లే!

అమ్మ ఎవరికైనా అమ్మే. వాహనం ఢీకొని కాళ్లు విరిగిన కోడెదూడ స్థితిని చూసి ఒక ఆవు తల్లడిల్లి పోయింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని కోడెదూడకు రెండు కాళ్లు విరిగాయి. లేవలేని స్థితిలో ఉన్న ఆ దూడ పరిస్థితిని గమనించిన తల్లి ఆవు కొమ్ములతో బిడ్డను లేపే ప్రయత్నం చేసింది. ఈ విషయాన్ని స్థానికులు మున్సిపల్ అధికారులకు తెలియజేయడంతో సిబ్బంది వచ్చి.. కోడె దూడను యజమానికి అప్పగించి రక్తం గడ్డ కట్టిన ప్రదేశాన్ని శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు.

- హుజూర్‌నగర్



గుండి వాగుతో గండం

కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న గుండివాసులకు ఏటా వాగు కష్టాలు తప్పడం లేదు. 2006లో ప్రారంభించిన వంతెన పనులు నిలిచిపోయాయి. కుమురంభీం ప్రాజెక్టు నుంచి బుధవారం నీటిని రెండు గేట్ల ద్వారా విడుదల చేయడంతో.. గుండి వాగులో వరద పెరిగింది. దీంతో జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు దాదాపు 30 కిలోమీటర్లు తిరిగి ఆసిఫాబాద్‌కు చేరుకోవలసి వస్తోంది. కొందరు మాత్రం వాగు నీటిని ప్రమాదకరంగా దాటుతున్నారు. వరద మరింత పెరిగితే తెప్పలపై ప్రయాణించాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో వాగులో తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు.. తొలకరి వర్షాలకే కొట్టుకుపోవడం గమనార్హం.

-ఆసిఫాబాద్ రూరల్

నేడు శ్రీవారి అక్టోబర్ నెల
ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారిలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 22న మధ్యాహ్నం మూడు గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేవిధంగా ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో గదుల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు, తిరుమల–తిరుపతి శ్రీవారి సేవ కోటా ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. కాగా, అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు సుప్రభాత సేవ మినహా, మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు. అక్టోబర్ 11, 12వ తేదీల్లో సుప్రభాత సేవతో పాటు అన్ని ఆర్జిత సేవలు రద్దయ్యాయి. అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు అంగప్రదక్షిణ, వర్చువల్ సేవా దర్శనం టికెట్లను రద్దు చేశారు.

జిల్లా వార్తలు

ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు హాల్‌టికెట్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగ(ఎక్స్‌టర్నల్) నియామకాలకు ఈనెల 20, 21వ తేదీల్లో రాతపరీక్ష నిర్వహించనున్నారు. ఈనేపథ్యాన దరఖాస్తు సమయాన పొరపాట్లు దొర్లిన వారి సుమారు 4వేల మంది హాల్‌టికెట్లునిలిపివేయగా, బుధవారం వారికి కూడా హాల్‌టికెట్లు విడుదల చేశారు. ఈమేరకు అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రాలకు అర గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రం చిరునామా, సమయంతో పాటు అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలను హాల్‌టికెట్లపై పొందుపర్చినట్లు వెల్లడించారు.

భారీ వర్షంతో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



ఓసీ-4లో నిలిచిన వర్షపు నీరు

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సింగరేణి పీకేఓసీ గనుల్లో 106 మి.మీ. మేర వర్షపాతం నమోదు కావడంతో గనుల్లో నీరు చేరి ఆరు వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అలాగే, 1.38 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత నిలిచిపోయింది. ఈ మేరకు గనుల్లో నిలిచిన నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోపక్క మణుగూరు వినాయకనగర్‌లోకి భారీగా నీరు చేరడంతో స్థానికులు అవస్థ పడ్డారు.

కొత్తగూడెం ఏరియాలో..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలో మంగళవారం రాత్రి నుండి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షం కారణంగా 8వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఏరియాలో రోజుకు 38 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండగా, 30వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదైంది.

పర్ణశాల ఆలయంపై పట్టింపు లేదా?



పర్ణశాల దేవాలయం

రామయ్య నడయాడిన నేల అభివృద్ధిపై చిన్నచూపు

- ఆదాయం సమకూరుతున్నా పట్టించుకోని యంత్రాంగం
- అరకొర వసతులతో అవస్థలు పడుతున్న భక్తులు
- కనీసం ఓ పూట గడిపేందుకు నీడ లేదనే ఆవేదన



కాటేజీల నిర్మాణం కోసం తీసిన గోతుల్లో చేరిన నీరు

దుమ్ముగూడెం: దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి గాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి అనుబంధ దేవాలయమైన దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల ఆలయ అభివృద్ధిపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఏటా హుండీ ద్వారా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుండటమే కాక దుకాణాల వేలం ద్వారా కూడా ఆదాయం వస్తోంది. అయినప్పటికీ భక్తులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారు. భద్రాచలం ఆలయానికి వచ్చే భక్తులంతా పర్ణశాలలోనూ రామయ్యను దర్శించుకుని ఇక్కడి గోదావరి ప్రాంతంలో బోట్ షికారు చేసి ప్రకృతి అందాలను చూసి పరవశించిపోతారు. ఇంతటి ప్రాశస్త్యం, ప్రత్యేకతలు ఉన్న దేవాలయంపై పాలకులు, అధికారుల చిన్నచూపుతో అభివృద్ధి జరగక, సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేల మంది భక్తులు స్వామి వారి దర్శనం కోసం వస్తుండగా, శని, ఆదివారాల్లో ఈ సంఖ్య రెట్టింపవుతుంది. అయినప్పటికీ భక్తులు నిరాశగానే వెనుతిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నిలువ నీడ లేదు..

పర్ణశాల ఆలయానికి ఏటా వివిధ రూపాల్లో రూ.కోటికి పైగా ఆదాయం సమకూరుతోంది. అయినా వేలాదిగా వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వేసవిలో విడిది చేయాలనే భావనతో దూర ప్రాంతాల నుంచి భక్తులు పర్ణశాలకు వస్తున్నా ఇక్కడ కాటేజీలు లేవని తెలిసి నిరాశగా వెనుతిరుగుతున్నారు. పర్ణశాలలో కాటేజీలు నిర్మిస్తే ఆలయానికి ఆదాయం పెరగడంతో పాటు వ్యాపార పరంగానూ అభివృద్ధి చెందే అవకాశముంది.


నత్తనడకన 'ప్రసాద్' పనులు

భద్రాచలం ఆలయంతో పాటు పర్ణశాల ఆలయంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన 'ప్రసాద్' పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పర్ణశాల రామాలయానికి మరిన్ని హంగులు కల్పించి పర్యాటక కేంద్రంగా రూపుదిద్దాలనే ఉద్దేశంతో 'ప్రసాద్' పథకం అమలుకు సర్వే చేయించింది. ఇందులో భాగంగా అధికారులు రూ.16.63 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఇది జరిగి రెండేళ్లయినా ఏ పని మొదలేకాలేదు. ప్రస్తుతం కాటేజీల నిర్మాణం కోసం గోతులు తీసినా వర్షాకాలం రావడంతో నిలిపివేశారు. దీంతో ఆ గోతుల్లో వర్షపు నీరు నిలవగా.. మళ్లీ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ఈఓ దృష్టి సారిస్తేనే..

భద్రాచలం దేవస్థానం ఈఓగా బాధ్యతలు చేపట్టిన ఎల్.రమాదేవి అతి తక్కువ కాలంలోనే ఆలయ అభివృద్ధిపై తనదైన ముద్ర వేశారు. అంతేకాక పలు సమస్యలనూ పరిష్కరించారు. అదే తరహాలో పర్ణశాల ఆలయంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. కనీసం ఓ పూట విడిది చేసేలా కాటేజీల నిర్మాణం, భక్తులు సేద తీరేవిధంగా పార్కుల నిర్మాణం చేపట్టాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.


కాటేజీలు నిర్మించాలి..



పర్ణశాల రామయ్య దర్శనానికి దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. రాత్రయితే స్వస్థలాలకు వెళ్లలేని వారు ఇక్కడ ఉండేందుకు సరైన సౌకర్యాలు లేవు. ఆలయ అధికారులు స్పందించి కాటేజీలు నిర్మించడంతోపాటు ఇతర వసతులు కల్పించాలి.

-ఎం.గని, నల్లగొండ జిల్లా

అరకొర సౌకర్యాలు..



పర్ణశాలలో అరకొర వసతులే ఉన్నాయి. స్వామి దర్శనం అనంతరం కాసేపు విశ్రాంతి తీసుకుందామంటే నిలువ నీడ లేదు. ఏటా మేం స్వామి దర్శనానికి వస్తున్నాం. కానీ, నేటి వరకు భక్తులకు ఉపయోగపడే సౌకర్యాలు కానరాలేదు.

-దేవ సుధాకర్, కృష్ణా జిల్లా

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


- కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు దశల వారీ పోరాటాలు
- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు




మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు, కోతలు లేకుండా రూ.2 లక్షల మేర రైతు రుణమాఫీ చేయాల్సిందేనని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. కానీ ఇప్పుడు తెల్లరేషన్ కార్డు, ఇతర అంశాలను ప్రామాణికంగా ప్రకటించడం రైతులను ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. జేఎల్‌జీ సంఘాల రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని, లేకుంటే కౌలు రైతులు నష్టపోతారని చెప్పారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా హామీల అమలులో తాత్సారం చేస్తున్నారని రంగారావు విమర్శించారు. కొత్త రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం, వ్యవసాయ కార్మికులకు ఏటా రూ.12 వేల పంపిణీ, ధరణి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలిపారు. ఈ మేరకు 22న రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, 29న కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేపట్టడంతో పాటు ఆగస్టు 21న చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు రంగారావు వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అన్ని పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కెచ్చల రంగయ్య, చిన్న చంద్రన్న, గుమ్మడి నర్సయ్య, వి.ప్రభాకర్, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ముద్ద భిక్షం, ఎం.కృష్ణ, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రంగుమారిన 'కిన్నెరసాని'!



ఐదు రోజుల క్రితం నీలం రంగులో...



రంగు మారడంతో ఇప్పుడు ఇలా...

శుద్ధి చేసినట్లు స్వచ్ఛంగా కనిపించే కిన్నెరసాని జలాశయంలోని నీరు రంగు మారింది. పాల్వంచ మండలం కిన్నెరసాని రిజర్వాయర్‌లో ఐదు రోజుల కిందటి వరకు నీరు నీలం రంగులో కనిపించింది. అయితే, ఇటీవల వర్షాలతో ఎగువ నుంచి వరద వచ్చి చేరుతుండటంతో ఆ నీరు కాస్తా కలుషితమై బురద రంగులోకి మారింది. కాగా, 407 అడుగుల మేర నిల్వ సామర్థ్యం కలిగిన ఈ జలాశయం నుంచి కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు వివిధ కర్మాగారాలకు నీరు సరఫరా అవుతోంది. అయితే, రంగు మారిన నీరు వస్తుండటంతో శుద్ధి చేసుకుని తాగాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఇక ఎగువన కురుస్తున్న వర్షాలతో కిన్నెరసానికి వరద ఉధృతి కొనసాగుతుండగా నీటిమట్టం బుధవారం ఉదయానికి 402.90 అడుగులకు చేరింది. దీంతో మూడు గేట్లు ఎత్తి 12 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

– పాల్వంచరూరల్

త్వరలో రీజియన్‌కు 25 కొత్తబస్సులు

- రోజువారీ 2.40 లక్షల మంది ప్రయాణం
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సరిరామ్

సత్తుపల్లిటౌన్: ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోలకు త్వరలో 25 కొత్త బస్సులు రానున్నాయని, పాడైపోయిన బస్సుల స్థానంలోనూ కొత్తవి కేటాయించనున్నట్లు రీజినల్ మేనేజర్ అజ్మీరా సరిరామ్ వెల్లడించారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు బుధవారం వచ్చిన ఆయన రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం 'లక్ష్యే లక్ష్యం' కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే, శ్రీరామ నవమికి ముత్యాల తలంబ్రాలు అత్యధికంగా బుకింగ్ చేసిన సత్తుపల్లి వీబీఓ కిన్నెర ఆనంద్, ఎస్.సునీతను సత్కరించారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ రీజియన్‌లో ప్రతిరోజు 2.42 లక్షల కి.మీ. తిరుగుతున్న బస్సుల ద్వారా ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్లు తెలిపారు.



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌ఎం సరిరామ్

ప్రస్తుతం 100 మంది వరకు డ్రైవర్ల కొరత ఉన్నా సామర్థ్యానికి మించి బస్సులను తిప్పుతున్నామని చెప్పారు. తల్లాడ, అశ్వారావుపేట, వీ.ఎం.బంజరు, మండలపల్లి బస్టాండ్లలో మరమ్మతు, సత్తుపల్లి బస్టాండ్‌లో అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. కాగా, ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు ప్రయాణికులు సహకరించాలని కోరారు. ఇక ఉద్యోగులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు ఇతర బస్సుల్లోనూ ప్రయాణికులు ఎక్కేలా కృషి చేస్తూ డిపోకు రూ.లక్ష ఆదాయం అదనంగా ఆర్జించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ, కార్గో ఇన్‌ఛార్జ్ మున్నీర్‌పాషా, ఏడీసీలు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.